## నిరుద్యోగ నిర్మూలన

# ఉద్యోగ కల్పనల ప్రహసనం

**సామ్రాజ్యవాద** ప్రపంచీకరణ అమలులోకి తెచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, వాని ప్రకటిత లక్ష్యాలు సాధించటంలో ప్రత్యేకించి ప్రపంచ ప్రజల జీవితాలలో సౌభాగ్యం సాధిస్తామన్న దానిలో నూటికి నూరుపాళ్ళు విఫలమయ్యాయని చాలా స్పష్టంగా రుజువైంది. అంతేగాక, దీనికి భిన్నంగా ఆకలి, పేదరికం, నిరుద్యోగం, కష్టాలు, ఉద్యోగ హీనత నిలకడగా పెరుగుతూ వస్తున్నాయనేది నిరాకరించవీలులేని రుజువైన వాస్తవం. సంపదల పంపిణీలో అసమానతలు వాస్తవానికి బద్దలయ్యే నిష్పత్తిలో పెరుగుతున్నాయి.

ప్రపంచవ్యాపితంగా ఆకలితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వుందని, అలాగే పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోందని 2016 నాటికి 81 కోట్ల 50 లక్షలమంది పౌష్టికాహార లోపానికి గురై వున్నారని ఐక్యరాజ్య సమితి తాజాగా విడుదలచేసిన తన నివేదికలో పేర్కొంది.

ప్రపంచంలో 70 కోట్లమంది కార్మికులు పేదరికంలో నివసిస్తున్నారని, ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలలోని 14కోట్ల 50 లక్షల యువ కార్మికులు ఘోరమైన పేదరికంలో మగ్గుతున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తన తాజా నివేదికలో నొక్కి చెపుతూ వివరాలను వెల్లడించింది. ప్రపంచవ్యాపితంగా 19 కోట్ల 27 లక్షలమంది నిరుద్యోగులుగా మార్చ బడ్డారని కూడా ఆ నివేదిక తెలిపింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నాయకత్వంలోని నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ పాలనలో చేదు వాస్తవాలు ఇలా వున్నాయి.

అయితే, ఈ నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో భాగమైన మన దేశ పాలకులు, తమ ప్రగతిశీల విధానాలు, పథకాలుగా చెప్పబడేవాని ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని ప్రలోభపరుస్తూ భారీ వాగ్దానాలతో ప్రజలను మోసగించటానికే నిర్ణయించుకున్నారు.

ప్రధాని నరేంద్రమోదీ తన ఎన్నికల ప్రచారం లోనూ, వారి ఎన్నికల ప్రణాళికలోనూ ఎన్‌డిఏ ప్రభుత్వం నూతనంగా ప్రతి సం॥రం కోటి ఉద్యోగాలను కల్పిస్తుందని చాలా ఘనంగా ప్రకటించుకున్నారు. తన ప్రకటనలపై నమ్మకం కలిగించేందుకు ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేసే 'మేక్ ఇన్ ఇండియా'ను భారీస్థాయిలో ప్రారంభించారు.

ప్రతి సంవత్సరం మన దేశంలో పనిచేయగల వయోజనుల సమూహంలోకి 1 కోటీ 30 లక్షల మంది చేరుతుండగా, 70 లక్షలమంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుండగా, ఏనాటి నుండో ఉద్యోగార్థులై వుండి వేచివున్నవారు మరెందరో వున్నారు. ప్రతి సం॥రం నిజంగా కోటి ఉద్యోగాలు కల్పించినప్పటికీ, అవి కూడా తగినవిధంగా ఉద్యోగ అవసరాలను తీర్చలేవు.

ప్రస్తుత నిరుద్యోగ శాతాన్ని పెరగకుండా నిలకడగా కొనసాగించాలంటే కూడా 85 లక్షల ఉద్యోగాలను ఏటా కల్పించాల్సి వుంటుందని 'ఉద్యోగ రహిత అభివృద్ధి' అనే తన నివేదికలో ప్రపంచబ్యాంకు అంచనావేసింది.

ఇవన్నీ అరాకొరా అంచనాలే అయినప్పటికీ, ఆమేరకైనా ఉద్యోగాల కల్పన జరుగుతుందా అంటే అదీలేదు. ఇక ఉద్యోగాల నాణ్యత గురించి మాట్లాడకపోవటమే మంచిది. ఉద్యోగనాణ్యత క్రమంగా ఘోరంగా దిగజారుతూ వుందని యుబిఎస్ సెక్యూరిటీ ఇండియా నివేదించింది.

"తీవ్ర నిరుద్యోగ సమస్య" వుందని, అధిక వేతన ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరాన్ని ప్రోత్సహించాలని 'నీతి ఆయోగ్' అంగీకరించింది.

అయితే ప్రకటించబడిన సంఖ్యలోనూ, ఆ నాణ్యతలోనూ పాలకులు ఉద్యోగాలు కల్పించటం లేదు. ఎన్‌డిఏ పాలకులు ప్రతి సం॥రం ఉద్యోగాల గురించి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు.

2016-17లో దాదాపు 1 కోటీ 50 లక్షల ఉద్యోగాలు కల్పించామని ప్రధాని, అతని సలహా బోర్డు సభ్యులు, నీతి ఆయోగ్ సభ్యులు ప్రచార మాధ్యమాల ద్వారా నిరంతరం ప్రచారం చేస్తూనే వస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక వ్యవస్థను నియంత్రించిన కారణంగా యువత దాదాపు 70 లక్షల ఉద్యోగాలు, 65 సం॥లపై బడిన పెద్ద వయస్కులు దాదాపు 30 లక్షల ఉద్యోగాలు కోల్పోయారు. అంటే మొత్తంమీద నూతనంగా 18 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించబడ్డాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మూసివేత కారణంగా మనదేశ ఆర్థిక వ్యవస్థ పురోగమించక పోవటంతో పాటు నిరుద్యోగం పెరిగిపోతోంది.

2017 -18 ఆర్థిక సం॥ మొదటి త్రై మాసికంలో 3.7 శాతంగా వున్న నిరుద్యోగ పెరుగుదల శాతం, 2018 మార్చినాటికి 6.3 శాతానికి పెరిగి, 2018 ఏప్రియల్‌లో 7.4 శాతానికి చేరుకుందనేది వాస్తవం. ఇదే మనదేశంలోని నిరుద్యోగ పరిస్థితి వాస్తవ చిత్రణను మనముందు వుంచుతోంది. రైల్వేశాఖ ప్రకటించిన 90 వేల ఉద్యోగాలకు 25 లక్షల మంది దరఖాస్తు చేసుకోవటం, నిరుద్యోగ సమస్య యొక్క రెండు పార్శ్వాలను వెల్లడి చేస్తోంది. 1. నిరుద్యోగ సమస్య మనదేశంలో ప్రబలి పోవటం, 2. చిన్నస్థాయి ఉద్యోగాలైనప్పటికీ ప్రైవేటు లేదా అసంఘటిత లేదా అనియత రంగాలలోని ఉద్యోగాలతో పోల్చినపుడు భద్రమైన ఉద్యోగం, అధికవేతనం ఆశించటం.

ఎన్‌డిఏ పాలకులు, వారి వందిమాగధులు తాము అధికారంలోకి వచ్చాక చాలా గొప్పగా ఉద్యోగాలు కల్పించామని, అది కూడా నియత రంగంలో భద్రమైన ఉద్యోగాలనీ, భారతదేశంలో 4 కోట్ల 40 లక్షల ఉద్యోగాలు కల్పించడంద్వారా ప్రపంచంలోనే

ఉద్యోగ కల్పనలో రెండవ అతి పెద్ద దేశంగా వుందంటూ నిరంతరాయంగా చెప్పుకుంటూ వస్తున్న గొప్పల గురించిన కఠోర వాస్తవాలు ఇలా వున్నాయి.

మన దేశపాలకులు ఎన్నో ఉద్యోగాలు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించామని బుకాయిస్తున్నారు. నియతరంగంలో ఉద్యోగాలు కల్పించామన్న ఇపిఎఫ్ఓ సమాచారాన్ని, 'ముద్ర' లబ్ధిదారులను, స్వయంఉపాధిదార్లనూ రుజువుగా చూపుతోంది.

ఇపిఎఫ్ఓ చందాదారుల సంఖ్య అకస్మాత్తుగా పెరగటమనేది, వారు ప్రకటించుకుంటున్నట్లుగా కొత్త ఉద్యోగాలు సృష్టించబడినందువలన మాత్రం కాదు. ఇపిఎఫ్ఓలో పూర్వం నమోదుకాకుండా కొత్తగా నమోదుచేసుకున్న కార్మికులను సభ్యులుగా చేర్చుకోవటానికి పరిశ్రమల యాజమాన్యానికి ఆమ్నెస్టీ అవకాశం కల్పించటం, ఈ సంఖ్యలో పెరుగుదలకు కారణం. పైగా 90 శాతం పైగా దీనిలో నమోదు చేసుకున్నవారు నెలకు 15,000 రూ॥ కంటే తక్కువమాత్రమే సంపాదన కలిగి వున్నారని, అనియతరంగంలోని కార్మికుల కంటే వారి ఉద్యోగాలు నాసిగా వున్నాయని తెలుస్తోంది.

లోక్‌నీతి, సిఎస్‌డిఎస్, ఇండియాటుడే, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి వంటివి కూడా భారతదేశంలో ఉద్యోగాల కల్పన, ఉద్యోగాలలో నాణ్యత, నిరుద్యోగం గురించి ఇవే వాస్తవాలను ఎత్తిచూపాయి.

'ముద్ర' లబ్ధిదారుల గురించిన ప్రకటన కూడా బూటకమైనదే. 2013-14లో నిర్వహించిన ఆరవ ఆర్థిక సర్వే ప్రకారం 5 కోట్ల 85 లక్షలమంది స్వయం ఉపాధి పొందనున్న వారి మొత్తం సంఖ్యగా పేర్కొనగా, వారిలో 4 కోట్ల 19 లక్షల 70 వేల మంది ఇప్పటికే స్వయం ఉపాధి కల్పించుకున్న వారుగా వున్నారు. 'ముద్ర' రుణగ్రహీత తనవద్ద మరొకవ్యక్తికి కూడా ఉపాధి చూపలేని, తను మాత్రమే ఏకైక స్వయం ఉపాధిదారునిగా వున్నాడనేది దీని అర్థం. ఈ విధంగా ముద్ర లబ్ధిదారులలో 72 శాతం మనుగడకోసం పనిచేస్తున్న సాధారణ కార్మికులుగా మాత్రమే వున్నారు. మరో ఉద్యోగం పొందే అవకాశం లేక వారు దీనిని ఎంచుకున్నారు. వీరికి ఎలాంటి ఉద్యోగభద్రత లేకుండా, అసంఘటితరంగ కార్మికులవలె మార్కెట్‌శక్తుల దోపిడీకి అనువుగా వున్నారు. 'ముద్ర' పథక లబ్ధిదారులుగా వున్నవారిలో 85 శాతంమంది స్వయం ఉపాధిద్వారా నెలకు పదివేల రూ॥కంటే తక్కువ సంపాదన కలిగి వున్నారనే చేదువాస్తవం 'ముద్ర' పథకం క్రింద స్వయం ఉపాధి కల్పనలో సృష్టిస్తున్న ఉద్యోగాల నాణ్యతయొక్క డొల్లతనాన్ని వెల్లడి చేస్తోంది.

అలాగే కార్మికుల నైపుణ్యాన్ని అభివృద్ధి పరిచే పేరుతో ఎన్‌డిఏ పాలకులు, 'స్కిల్ ఇండియా'గా పిలవబడే ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై)ను ఘనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 'నైపుణ్యం పొందిన' కొద్దిమందికూడా నిరుద్యోగులుగానే మిగిలివున్నారు.

'ముద్ర' రుణ పథకం క్రింద వారిని స్వయం ఉపాధిదార్లుగా రూపొందిచమని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది.

"పకోడీలు వేయటం లేదా ఆవులను కాయటం" వంటి వాటిని కూడా స్థిరమైన ఉద్యోగాలుగా ఎన్‌డిఏ పాలకులు పరిగణిస్తున్న వైనం ఈ విధంగా వుంటే, ఉద్యోగాల కల్పనను, మరీ ముఖ్యంగా నాణ్యమైన ఉద్యోగాలను వారి నుండి ఆశించడం వెర్రితనమే అవుతుంది. ఉద్యోగాలు కల్పిస్తామంటూ కేవలం ఆడంబర నినాదాలు ఇచ్చి, మరోవైపున మతోన్మాద ఉద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి ఎగబ్రాకే పథకాలతో ప్రజలను మోసగించటంలో వారు నైపుణ్యం కలిగివున్నారు.

గౌరవనీయమైన, హుందా అయిన పనిచేస్తూ భద్రంగా జీవించగలగటాన్ని మనదేశంలో ప్రజలు ఈనాడు అత్యావశ్యకంగా కోరుకుంటున్నారు. సామ్రాజ్యవాదానికి, దాని నయా ఉదారవాద దోపిడీ ఆర్థిక విధానానికి ఊడిగం చేస్తూ, వారి ప్రయోజనాల పరిరక్షణకు కంకణం కట్టుకున్న మనదేశపాలకులు, ప్రజల మౌలిక ఆకాంక్షలను నెరవేర్చరు; నెరవేర్చబోరు కూడా.

కనుక నిరుద్యోగులంతా ఇతర సెక్షన్ల శ్రామిక ప్రజానీకంతో కలిసి చెదరని ఐకమత్యంతో నిలకడగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటం ద్వారానే గౌరవనీయమైన, హుందా అయిన, భద్రమైన ఉద్యోగాలు సాధ్యమౌతాయి.

oooo